క్లుప్తంగా

ధాన్యం సేకరణపై జేసీ సమీక్ష



కంకిపాడు: ధాన్యం సేకరణ సమర్థంగా సాగాలని జేసీ గీతాంజలి శర్మ ఆదేశించారు. మండలంలోని దావులూరు గ్రామంలోని బాలాజీ రైస్ మిల్లును శనివారం ఆమె సందర్శించారు. సేకరించిన ధాన్యం, తేమ శాతం పరిశీలన రికార్డులను పరిశీలించారు. ధాన్యం సేకరణ జరిగిన తీరుపై అధికారులు, రైస్ మిల్లు సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. గీతాంజలి శర్మ మాట్లాడుతూ ధాన్యం సేకరన సమర్థంగా సాగాలని, రైతులను ఇబ్బందులకు గురిచేసినట్లు ఆరోపణలు వస్తే సహించేది లేదన్నారు. ప్రభుత్వం సూచించిన నిబంధనలు పాటించాలని సూచించారు. పరిశీలనలో డీఎస్‌ఓ పార్వతి, డెప్యూటీ తహసీల్దార్ నాగరాజు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

గన్నవరంరూరల్: మండలంలోని వీరపనేని గూడెం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ వై.యశోదలక్ష్మి తెలిపారు. స్థానిక విలేకరులతో శనివారం ఆమె మాట్లాడుతూ 5వ తరగతి, ఇంటర్మీడియెట్‌లో ప్రవేశానికి దరఖాస్తులు అందజేయాలన్నారు. ప్రస్తుతం 4వ తరగతి, 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులని చెప్పారు. మార్చి 10వ తేదీన ఉదయం 10 నుంచి 12 గంటల వరకు పరీక్ష జరుగుతుందన్నారు. వివరాలకు వీరపనేనిగూడెం బాలికల గురుకుల పాఠశాలలో సంప్రదించాలని సూచించారు. జనరల్, బీసీ, బీసీ సీ విద్యార్థులు 2013 సెప్టెంబర్ 1 నుంచి 2015 ఆగస్టు 31 మధ్య జన్మించి ఉండాలన్నారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు 2011 సెప్టెంబర్ 1 నుంచి 2015 ఆగస్టు 31 మధ్య జన్మించిన విద్యార్థులు అర్హులని చెప్పారు.

ఎంపీడీఓను కలిసిన వెల్ఫేర్ అసిస్టెంట్‌లు



పెనమలూరు: పెనమలూరు నూతన ఎంపీడీఓ కుమార్‌బాబును సచివాలయాల వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్‌లు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. పెనమలూరు మండల పరిషత్ కార్యాలంలో జరిగిన కార్యక్రమంలో మండల పరిధిలో ఉన్న 11 సచివాలయాల వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్‌లు ఎంపీడీఓ కుమార్‌బాబును కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ప్రభుత్వ పథకాలు, పరిపాలనలో ఎంపీడీఓతో కలిసి పూర్తి సేవలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో గంగూరు వెల్ఫేర్ సెక్రటరీ ప్రేమ్‌సుధాకర్, సెక్రటరీలు పాల్గొన్నారు.

పరిశ్రమలతో భాగస్వామ్యం



పెనమలూరు: శాస్త్ర సాంకేతిక రంగాలు అభివృద్ధి చెందుతున్నందున ప్రముఖ పరిశ్రమలతో భాగస్వామ్య సదస్సు నిర్వహించామని ధనేకుల ఇంజినీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కడియాల రవి తెలిపారు. గంగూరు ధనేకుల ఇంజినీరింగ్ కాలేజీలో శనివారం ప్రముఖ కంపెనీల ప్రతినిధులతో సదస్సు నిర్వంచారు.ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రవి మాట్లాడుతూ.. ఈ సదస్సు ద్వారా నైపుణ్యాభివృద్ధి, భాష ప్రావీణ్యం, సాంకేతికంగా కృత్రిమ మేధాలో వస్తున్న మార్పుల గురించి విద్యార్థులకు వివరించామన్నారు. అకడమిక్ డైరెక్టర్ రవిప్రసాద్ మాట్లాడుతూ.. ప్రముఖ బహుళ జాతీయ సంస్థలతో అనుసంధానం కావటం వలన విద్యార్థులకు ఇంటర్న్ షిప్, ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. భారత్ బ్లాక్ చైన్ నెట్‌వర్క్‌తో అనుసంధానం చేశామని చెప్పారు. సదస్సులో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

పెనమలూరు: తాడిగడప మున్సిపాలిటీలో వివిధ విభాగాల్లో రిసోర్స్ పర్సన్స్‌గా పని చేస్తున్న తమ సమస్యలు ప్రభుత్వం పరిష్కరించాలని మున్సిపల్ కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావును ఆర్పీలు కోరారు. ఈ మేరకు శనివారం వినతిపత్రం అందజేసి వివరాలు వెల్లడించారు. జగనన్న అధికారంలోకి వచ్చిన తరువాత ఆర్పీల జీతం రూ.10 వేలకు పెంచారన్నారు. అయితే ఆర్పీల ఉద్యోగ భద్రత, జీతాలు వ్యక్తిగత ఖాతాలో జమ చేయటం, కాంట్రాక్టు ఉద్యోగులతో పాటు వేతనాలు పెంచటం, పదవి విరమణ వయస్సు 62 సంవత్సరాలకు పెంచటం, ఈఎస్ఐ, పీఎఫ్, ఆరోగ్య బీమా కల్పించాలని కోరారు. ఈ నెల 5వ తేదీన చేపట్టనున్న నిరసనకు కమిషనర్‌ను అనుమతి కోరారు. కార్యక్రమంలో సంఘ నేతలు ఎం.సుజాత, స్వప్న, రాజ్యలక్ష్మి, జయ, ఎం.మునీర్, సీఐటీయూ నేత ఉప్పాడ త్రిమూర్తి తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారుల నైపుణ్యం పెంపుదలకు కృషి



షటిల్ పోటీల్లో విజేతలతో ఉపాధ్యాయులు



క్రికెట్ పోటీల్లో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన మచిలీపట్నం జట్టు

మున్సిపల్ కమిషనర్ జి. బాలసుబ్రహ్మణ్యం

గుడివాడ టౌన్: క్రీడలు మానసిక స్థైర్యంతో పాటు శారీరక దారుఢ్యాన్ని పెంపొందిస్తాయని మున్సిపల్ కమిషనర్ జి. బాలసుబ్రహ్మణ్యం అన్నారు. ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీల ముగింపు అనంతరం శనివారం విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారుల నైపుణ్యాన్ని వెలికి తీసి క్రీడా స్ఫూర్తిని పెంపొందించడానికి కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తుందని చెప్పారు. మున్సిపల్ కార్యాలయంలోని ఆయన చాంబర్‌లో ఖో-ఖో మహిళ, పురుషుల విభాగాల్లో జిల్లా స్థాయి పోటీల్లో ప్రథమస్థానం సాధించిన క్రీడాకారులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ డీటీవీ కృష్ణారావు, వ్యాయామ ఉపాధ్యాయులు మడకా ప్రసాద్, ఏసురత్నం పాల్గొన్నారు. షటిల్ బ్యాడ్మింటన్ డబుల్స్ పోటీల్లో ఏజీకే మున్సిపల్ హైస్కూల్ విద్యార్థులు ఉత్తమ నైపుణ్యాన్ని ప్రదర్శించి మొదటి స్థానం కైవసం చేసుకోవడంతో పాటు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయురాలు పీఎల్ నర్సమాంబ తెలిపారు. పాఠశాలకు చెందిన ఎస్. వర్షిణి, హైని మేఘన పోటీలో విజయం సాధించారన్నారు. ఎన్టీఆర్ స్టేడియంలో జరిగిన పురుషుల విభాగం క్రికెట్ పోటీల్లో మచిలీపట్నం జట్టు పెడన జట్టుపై విజయం సాధించి ప్రథమస్థానం కైవసం చేసుకున్నట్లు నిర్వాహకులు తెలిపారు.



ఖో-ఖో పోటీలలో రాష్ట్ర స్థాయికి ఎంపికైన క్రీడాకారులతో మున్సిపల్ కమిషనర్ బాల సుబ్రహ్మణ్యం

వైఎస్సార్ సీపీ గెలుపే లక్ష్యంగా పని చేస్తాం



మంత్రి జోగి రమేష్‌ను సత్కరిస్తున్న మాజీ జెడ్పీటీసీ పూర్ణిమ, కోటయ్య దంపతులు

ఉయ్యూరు: వైఎస్సార్ సీపీ గెలుపే లక్ష్యంగా పని చేస్తామని ఉయ్యూరు మాజీ జెడ్పీటీసీ యలమంచిలి పూర్ణిమ తెలిపారు. మండలంలోని కాటూరు గ్రామానికి చెందిన పూర్ణిమ, కోటయ్య చౌదరి గత కొంతకాలంగా పార్టీకి దూరంగా ఉంటున్నారు. వ్యక్తిగత కారణాలతో జెడ్పీటీసీ పదవికి రాజీనామా చేశారు. ఈ నేపథ్యంలో పెనమలూరు నూతన ఇన్‌చార్జిగా నియమితులైన జోగి రమేష్ పార్టీకి సేవలు అందించాలని పూర్ణిమ ఆమె కుటుంబ సభ్యులను కోరారు. దీంతో పూర్ణిమ, ఆమె భర్త కోటయ్య చౌదరిలు మంత్రి జోగి రమేష్‌ను శనివారం కలిసి పార్టీలో జరిగే పరిణామాలపై చర్చించారు. జోగి రమేష్‌ను సత్కరించి పార్టీ అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. పూర్ణిమ మాట్లాడుతూ రాష్ట్రానికి జగనన్నే మళ్లీ సీఎం కావాల్సిన అవసరం ఉందన్నారు. పెనమలూరులో వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేసేందుకు పార్టీ శ్రేణులంతా శ్రమించాలన్నారు. నూతన ఉత్సాహంతో పార్టీలో కొనసాగి పార్టీ పటిష్టతకు తమ వంతు కృషి చేస్తామని చెప్పారు. పెద ఓగిరాల ఎంపీటీసీ గుంటక నాగిరెడ్డి, పలువురు నాయకులు పాల్గొన్నారు.

యనమలకుదురు ఆలయంలో ప్రత్యేక పూజలు



అలంకరణలో శ్రీరామలింగేశ్వరస్వామి

పెనమలూరు: యనమలకుదురు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ పార్వతీ సమేత శ్రీరామలింగేశ్వరస్వామివారి దేవస్థానంలో శనివారం స్వామివార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 6.30 గంటలకు రుద్రాభిషేకం, నిర్వహించి స్వామివారిని విశేషంగా అలంకరించారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

రేపు టెండర్ల ప్రకటన..

ఆలయంలో మహాశివరాత్రి సందర్భంగా ఆలయంలో పలు ఏర్పాట్లపై వచ్చిన వివిధ టెండర్లు అధికారుల సమక్షంలో సోమవారం తెరుస్తామని ఈఓ బి.గంగాధరరావు తెలిపారు. మహాశివరాత్రి కల్యాణ మహోత్సవం లైటింగ్, కొబ్బరి చిప్పలు తదితర పనులకు దాఖలైన సీల్డ్ టెండర్లు అధికారుల సమక్షంలో తెరిచి ఖరారు చేస్తామన్నారు. అదే రోజున అమ్మవారికి భక్తులు సమర్పించిన చీరల బహిరంగ వేలం నిర్వహిస్తామని చెప్పారు.

అథ్లెటిక్స్ క్రీడాకారిణికి ఎమ్మెల్యే వంశీ ఆర్థిక తోడ్పాటు



రేష్మకు నగదు అందజేస్తున్న ఎంపీపీ రవి తదితరులు

గన్నవరం: జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు వెళ్తున్న స్థానిక జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థిని షేక్ రేష్మకు ఎమ్మెల్యే డాక్టర్ వల్లభనేని డాక్టర్ వంశీమోహన్ రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ మేరకు విద్యార్థినికి ఎంపీపీ అనగాని రవి, జెడ్పీ కో ఆప్షన్ సభ్యుడు ఎండీ గౌసాని, సర్పంచ్ నిడమర్తి సౌజన్య చేతుల మీదుగా నగదు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ రవి మాట్లాడుతూ.. ప్రతిభవంతులైన క్రీడాకారులను ప్రోత్సహించడంలో ఎమ్మెల్యే వంశీమోహన్ ఎల్లప్పుడు ముందుంటారని చెప్పారు. అహ్మదబాద్‌లో ఈ నెల 16 నుంచి 18 వరకు జరిగే 60 మీటర్ల రన్నింగ్ పోటీలు, బిహార్‌లో జరగనున్న స్కూల్ గేమ్స్ 400 మీటర్ల హార్డిల్స్ పోటీలకు రేష్మ ఎంపికైందన్నారు. ఈ పోటీలకు వెళ్లేందుకు రేష్మ తల్లిదండ్రుల విజ్ఞప్తి మేరకు ఎమ్మెల్యే ఆర్థిక సాయం అందించారని తెలిపారు. ఈ పోటీల్లో రేష్మ అత్యుత్తమ క్రీడా ప్రదర్శన కనబరిచి పతకాలు సాధించాలని ఎంపీపీ ఆకాంక్షించారు. ఎంపీటీసీ త్రిపురనేని లక్ష్మీ నరసింహారావు, వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ నాయకుడు నిడమర్తి నాగేశ్వరరావు, విశ్రాంత పీఈటీ రాఘవేంద్రరావు, పీఈటీలు కె.గీత, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

విద్యార్థి దశ నుంచే లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలి

నున్న(విజయవాడరూరల్): జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకునేందుకు విద్యార్థి దశ నుంచే లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలని సీనియర్ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ మహమ్మద్ ఇమ్రాన్ సూచించారు. నున్న గ్రామంలోని వికాస్ విద్యా సంస్థలో వికసిత్ భారత్ ఉత్సవ్ ప్రోగ్రామ్ శనివారం జరిగింది. భారత ప్రధాని నరేంద్రమోదీ ఆలోచన అనుసారం 2047 కల్లా ఇండియా అభివృద్ధి చెందిన దేశంగా ఏర్పడటానికి దేశంలోని విద్యార్థుల ఆలోచనలు, దేశం ఎలా అభివృద్ధి చెందాలనే విషయంపై హే కథన్ కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఇమ్రాన్ మాట్లాడుతూ.. జీవితంలో ప్రస్తుతం స్థిరపడిన వారంతా ముందుగా లక్ష్యాన్ని ఎంచుకుని అభివృద్ధి చెందిన వారేనన్నారు. ప్రపంచంలో ఉన్న ముఖ్యమైన సమస్యలకు విద్యార్థులు పరిష్కారం కనుగొనాలని సూచించారు. వికాస్ విద్యాసంస్థల చైర్మన నరెడ్ల నర్సిరెడ్డి, వైస్ చైర్మన్ సత్యనారాయణరెడ్డి, ప్రిన్సిపాల్స్ డాక్టర్ బి.రమణ, డాక్టర్ పి.శ్రీనివాస్, అకాడమిక్ అడ్వైజర్ కీర్తి, అధ్యాపకులు పాల్గొన్నారు.

పేదల ఇళ్ల స్థలాలకు రిజిస్ట్రేషన్లు



నున్నలో రిజిస్ట్రేషన్లు చేస్తున్న అధికారులు

నున్న(విజయవాడరూరల్): రాష్ట్ర ప్రభుత్వం పేదలకు పంపిణీ చేసిన ఇళ్ల స్థలాలకు గ్రామ సచివాలయాల కార్యదర్శులు, రెవెన్యూ అధికారులు లబ్ధిదారుల పేరిట శనివారం నున్న గ్రామంలో రిజిస్ట్రేషన్లు చేశారు. నున్న గ్రామంలోని మూడు సచివాలయాల పరిధిలో 19 మంది లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలను రిజిస్ట్రేషన్లు చేశామని తహసీల్దార్ పి.జాహ్నవిరెడ్డి తెలిపారు. ప్రభుత్వ నిబంధనల మేరకు రిజిస్ట్రేషన్ జరిగిన రోజు నుంచి 10 సంవత్సరాల తర్వాత ఆ ఇళ్ల స్థలాన్ని లబ్ధిదారులు విక్రయించుకునే హక్కును ప్రభుత్వం కల్పించిందన్నారు. లబ్ధిదారులకు ఉచితంగా రిజిస్ట్రేషన్ చేస్తున్నామని చెప్పారు. నున్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం పరిధిలో నున్న, పాతపాడు, పి.నైనవరం, కొత్తూరు, జక్కంపూడి గ్రామాల పరిధిలో 71 ఇళ్ల స్థలాలకు రిజిస్ట్రేషన్లు జరిగాయని సబ్ రిజిస్ట్రార్ సీహెచ్ రామాంజనేయులు తెలిపారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం నుంచి సచివాలయాలకు సబ్‌స్టాఫ్‌ను పంపి సహాయ సహకారాలను అందజేస్తున్నామన్నారు. నున్న గ్రామ పంచాయతీ కార్యదర్శి జి.టి.వి.రమణ, అజేంద్ర, వరుణ్, వీఆర్వోలు చాంద్, శంకర్, శ్రీనివాసరావులు రిజిస్ట్రేషన్లు నిర్వహిస్తున్నారు.

మెరుగైన సేవలు అందించేందుకు కృషి



టీవీ సతీష్‌ను సత్కరిస్తున్న రెవెన్యూ ఉద్యోగులు

కంకిపాడు: మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తానని కృష్ణాజిల్లా సివిల్ సప్లయిస్ డీఎం టీవీ సతీష్ అన్నారు. ఇటీవల పదోన్నతి పొందిన ఆయనను మండలానికి చెందిన రెవెన్యూ ఉద్యోగులు శనివారం కంకిపాడులో కలిసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సతీష్ మాట్లాడుతూ సివిల్ సప్లయిస్ శాఖ ద్వారా అందాల్సిన సేవల్లో ఎలాంటి లోటుపాట్లు తలెత్తకుండా చర్యలు తీసుకుంటానన్నారు. ప్రభుత్వ మార్గదర్శకాలను సమర్థంగా అమలుచేస్తూ, ప్రభుత్వ సేవలను ప్రజలకు చేరువ చేసేందుకు అందరి సమన్వయంతో పని చేస్తానన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఘనంగా గ్రాడ్యుయేషన్ డే వేడుకలు



సర్టిఫికెట్లు అందుకున్న చిన్నారులు

గన్నవరం: స్థానిక వి.ఎస్.సెయింట్‌జాన్స్ మాధ్యమికోన్నత పాఠశాలలో శనివారం కెజి గ్రాడ్యుయేషన్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యుకెజి పూర్తి చేసిన చిన్నారులకు ప్రిన్సిపాల్ సంతోష్‌కుమార్ చేతుల మీదుగా సర్టిఫికెట్లను అందజేశారు. అనంతరం ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధే లక్ష్యంగా మాంట్‌పోర్ట్ విద్యా సంస్థలు పనిచేస్తున్నాయని చెప్పారు. అందులో భాగంగా ప్రీ ప్రైమరీ నుంచే పిల్లలకు క్రమశిక్షణ, నైతిక విలువలతో కూడిన విద్యను అందిస్తున్నామన్నారు. బాల్యం నుంచే విద్యార్థులకు మంచి నడవడిక, వ్యక్తిత్వాన్ని అందించడం వల్ల భవిష్యత్‌లో ఉన్నతులుగా ఎదుగుతారని చెప్పారు. అనంతరం కెజి విద్యార్థులు చక్కటి హావభావాలను ప్రదర్శిస్తూ చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు, బుడిబుడి నడకల నృత్యాలు అందరినీ అలంరించాయి. సీనియర్ బ్రదర్ జిమ్మీకురియోకోస్, బ్రదర్ భల్లా జోసఫ్, బ్రదర్ జయబాలన్, కెజి తరగతుల కో ఆర్డినేటర్ ఏకాంబరి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు క్యాన్సర్‌పై అవగాహన సదస్సు

పెనమలూరు: ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా తాడిగడప ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రిలో కంటి క్యాన్సర్‌పై ఆదివారం అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు క్యాంపస్ హెడ్ డాక్టర్ అనసూయ గంగూలి కపూర్ వెల్లడించారు. ఈ మేరకు శనివారం వివరాలు తెలుపుతూ ఆదివారం ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా కంటి క్యాన్సర్‌పై ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు. మూడేళ్లలోపు పిల్లలకు సంభవించే రెటీనోబ్లాస్టోమా కంటి క్యాన్సర్ వల్ల కలిగే సమస్యలను వివరిస్తామన్నారు. ఈ క్యాన్సర్ అత్యంత ప్రాణాతంకమైనదని, పిల్లల దృష్టికి ప్రమాదకరమని చెప్పారు. కంటి క్యాన్సర్‌పై సరైన అవగాహన లేకపోవటంతో దేశంలో ఏటా 1,500 కొత్త కేసులు బయటపడుతున్నాయని, దాదాపు 50 శాతం మంది ప్రాణాలు కోల్పోతున్నారని తెలిపారు.

సిద్ధం సభకు తరలిన పార్టీ శ్రేణులు



ఉప్పలూరు వద్ద బస్సులకు జెండా ఊపి ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ బాకీ బాబు



బుద్దవరం నుంచి సిద్ధం సభకు వెళ్తున్న పార్టీ శ్రేణులు

ఉయ్యూరు: దెందులూరులో వైఎస్సార్ సీపీ తలపెట్టిన సిద్ధం సభకు గన్నవరం, పెనమలూరు నియోజకవర్గాల నుంచి పెద్ద సంఖ్యలో పార్టీ శ్రేణులు తరలివెళ్లారు. ఉయ్యూరు మున్సిపాలిటీలోని 20 వార్డులు, మండలంలోని 11 గ్రామాల నుంచి ప్రజా ప్రతినిధులు, పార్టీ శ్రేణులు బస్సుల్లో తరలివెళ్లి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సభకు హాజరయ్యారు. పార్టీ మండల అధ్యక్షుడు దాసేరవి, సీడీసీ చైర్మన్ రాజులపాటి రామచంద్రరావు, మున్సిపల్ వైస్ చైర్మన్‌లు సోలే సురేష్ బాబు, అర్షతున్నీసాబేగం, ఎంపీపీ చీలి కల్పన, ప్రభుత్వాస్పత్రి చైర్మన్ జంపాన కొండలరావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

కంకిపాడు: రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి, పెనమలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి జోగి రమేష్ పర్యవేక్షణలో కంకిపాడు మండలంలోని ప్రతి సచివాలయం నుంచి ఏర్పాటు చేసిన బస్సుల్లో పార్టీ శ్రేణులు, నాయకులు, జగనన్న అభిమానులు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. ఉప్పలూరు వద్ద బస్సులకు జెడ్పీటీసీ సభ్యుడు బాకీ బాబు, ఏఎంసీ వైస్ చైర్మన్ మాదు వసంతరావు, కంకిపాడు వద్ద జేసీఎస్ చైర్మన్ రాచూరి చిరంజీవి జెండా ఊపి ర్యాలీ ప్రారంభించారు.

పెనమలూరు: రానున్న ఎన్నికల్లో టీడీపీ, పచ్చ మీడియా, పెత్తందారులను తరిమి కొట్టడానికి జగనన్నతో పాటు తాము సిద్ధమేనని పెనమలూరు వైఎస్సార్ సీపీ నేతలు, శ్రేణులు తెలిపారు. మండలం నుంచి 30 బస్సుల్లో పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు తరలివెళ్లారు. రానున్న ఎన్నికల్లో యుద్ధానికి తాము సిద్ధమేనని తెలిపారు. పోరంకిలో జరిగిన కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు మున్నంగి అర్జున్‌రెడ్డి, అద్దెపల్లి చందు, దేవినేని పున్నయ్యచౌదరి, ఎం.వెంకటేశ్వరరావు పలువురు పాల్గొన్నారు. యనమలకుదురులో గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ ఈడే చాముండేశ్వరి, పార్టీ నేతలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే వంశీమోహన్ నేతృత్వంలో..

గన్నవరం: సిద్ధం సభకు గన్నవరం మండలం నుంచి వైఎస్సార్ సీపీ శ్రేణులు భారీగా తరలివెళ్లారు. ఎమ్మెల్యే డాక్టర్ వల్లభనేని వంశీమోహన్ నేతృత్వంలో గ్రామగ్రామాన బస్సులను ఏర్పాటు చేశారు. బస్సులకు పార్టీ జెండాలు, సిద్ధం బ్యానర్లను కట్టుకుని ఉత్సాహంగా పార్టీ శ్రేణులు దెందులూరు బయలుదేరారు. ఆటోలు, ద్విచక్ర వాహనాల్లో కూడా కార్యకర్తలు ర్యాలీగా తరలివెళ్లారు.

గన్నవరంరూరల్: మండలంలోని అన్ని గ్రామాల నుంచి పార్టీ శ్రేణులు సిద్ధం సభకు భారీగా తరలివెళ్లాయి. గోపవరపుగూడెం, కొత్తగూడెం, సూరంపల్లి, రామచంద్రాపురం, జక్కులనెక్కలం తదితర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు.

హనుమాన్‌జంక్షన్‌రూరల్: బాపులపాడు మండలంలోని అన్ని గ్రామాల నుంచి 32 బస్సులు, 50 ఆటోలు, 500 ద్విచక్ర వాహనాల్లో వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, నాయకులు దెందులూరు బయలుదేరి వెళ్లారు. స్థానిక విజయవాడ రోడ్డులోని వైఎస్సార్ సీపీ కార్యాలయం వద్ద ఏపీ నాటక అకాడమీ డైరెక్టర్, పార్టీ మండల అధ్యక్షుడు నక్కా గాంధీ జెండా ఊపి బస్సులను ప్రారంభించారు. ఎమ్మెల్యే వల్లభనేని వంశీ నేతృత్వంలో ఆహారం ప్యాకెట్లు, మంచినీటి బాటిళ్లు ఏర్పాటు చేశారు. పామర్రు నియోజకవర్గంలోని పార్టీ శ్రేణులకు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో కె.సీతారామపురం వద్ద భారీ భోజనశాలను ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే కైలే సోదరుడు జగదీష్ బాబు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఉంగుటూరు: మండలం నుంచి అధిక సంఖ్యలో పార్టీ కార్యకర్తలు, నాయకులు, అభిమానులు సిద్ధం సభకు తరలి వెళ్లారు. మండల అధ్యక్షుడు వింత శంకర్‌రెడ్డి నేతృత్వంలో 20 బస్సులు, 40 కార్లు, 200 బైక్‌లపై పార్టీ శ్రేణులు తరలి వెళ్లారు.

విజయవాడరూరల్: విజయవాడ రూరల్ మండలంలోని అన్ని గ్రామాల నుంచి పార్టీ కార్యకర్తలు, నాయకులు సిద్ధం సభకు తరలివెళ్లారు. అంబాపురం గ్రామ పార్టీ కన్వీనర్ నల్లమోతు చంద్రశేఖర్, కోకన్వీనర్ తోడేటి బెంజిమెన్‌ల ఆధ్వర్యంలో బస్సులు ఏర్పాటు చేశారు. పి.నైనవరం గ్రామ పార్టీ కన్వీనర్ దావు వెంకటేశ్వరరావు(డీవీఆర్) ఆధ్వర్యంలో, పాతపాడు గ్రామ పార్టీ ఆధ్వర్యంలో, నున్న గ్రామ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో పార్టీ శ్రేణులు బస్సుల్లో తరలివెళ్లారు.

ప్రాంగణ ఎంపికలో 26 మంది విద్యార్థులకు ఉద్యోగాలు



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులు

పెనమలూరు: కానూరు వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీలో నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో 26 మంది విద్యార్థులు ఉద్యోగాలు సాధించారని కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఏవీ.రత్నప్రసాద్ అన్నారు. ఆయన శనివారం వివరాలు తెలుపుతూ అమెరికా బహుళ జాతీయ సంస్థ ఏటీ అండ్ టీ తమ కాలేజీలో కంప్యూటర్ సైన్స్, ఐటీ, ఈసీఈ చదువుతున్న 26 మంది విద్యార్థులను ఏడాదికి రూ.26 లక్షల వేతనంతో ఎంపిక చేసిందన్నారు. విద్యార్థుల లక్ష్యసాధనకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై ప్రత్యేక బోధన, శిక్షణ, గ్లోబల్ సర్టిఫికేషన్, ఆధారిత విద్యా విధానంతో ప్రతి విద్యార్థి సామర్థ్యం పెంపొందించుతున్నామన్నారు. కార్యక్రమంలో సీఎస్‌సీ విభాగాధిపతి డి.రాజేశ్వరరావు, ఐటీ విభాగాధిపతి ఎం.సునీత, ఉద్యోగాలకు ఎంపికై న విద్యార్థులు పాల్గొన్నారు.

రేపు ఉచిత వైద్యశిబిరం

ఆటోనగర్(విజయవాడతూర్పు): లయన్స్‌క్లబ్ ఆఫ్ ఆటోనగర్ జెమ్స్ ఆధ్వర్యంలో ప్రసాదంపాడులో సోమవారం ఉదయం 10 నుంచి ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్టు ఆ క్లబ్ అధ్యక్షుడు మహమ్మద్ ఇస్మాయిల్ తెలిపారు. దంత, కంటి, గుండె, క్యాన్సర్ వైద్య పరీక్షలు నిర్వహిస్తామన్నారు. వివరాలకు 98663 83383, 93929 88777 నంబర్లలో సంప్రదించాలన్నారు..

కంకిపాడు ఎస్ఐ-2గా తాతాచార్యులు



కంకిపాడు: కంకిపాడు పోలీస్ స్టేషన్ ఎస్ఐ-2గా డీఎస్ తాతాచార్యులు నియమితులయ్యారు. ఇటీవల జరిగిన బదిలీల్లో తాతాచార్యులు కంకిపాడు పీఎస్‌కు బదిలీపై వచ్చారు. శుక్రవారం రాత్రి స్థానిక పోలీస్ స్టేషన్‌లో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం సీఐ వీ.శ్రీనివాసరావును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్ఐ తాతాచార్యులు మాట్లాడుతూ.. శాంతిభద్రతల పరిరక్షణకు తన వంతు కృషి చేస్తానన్నారు.